


సాక్షి
పల్నాడు
బుధవారం, 8, మార్చి, 2023

రేపటికి
ముందడుగు



న్యూస్‌రీల్

పొడా వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డి



సాక్షి, నరసరావుపేట: పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాత్స్యసంస్థ పశుసంవర్ధక శాఖలో ఏడీ స్థాయిలో పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి డెప్యూటేషన్‌పై ఈ పోస్టులో పనిచేయనున్నారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్వామా పీడీగా, జెడ్పీ సీఈఓగా శ్రీనివాసరెడ్డి ఉత్తమ సేవలు అందించి ప్రశంసలు పొందారు.

రీ-సర్వేతో భవిష్యత్ తరాలకు మేలు

జేసీ రాజకుమారి




గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం భవిష్యత్ తరాలకు ఒక వరమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. 5 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేసిన సర్వే శాఖాధికారులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో వాటి వివరాలు సమర్పించారు. జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది చివరినాటికి రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. మేడికొండూరు మండలంలోని పొనుగుపాడు కండ్రిక, వట్టిచెరుకూరు మండలంలోని లేమల్లెపాడు గ్రామాల్లో సెక్షన్ 13 నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భావన్నారాయణుని తాకిన సూర్యకిరణాలు



చినగంజాం: పెదగంజాం భావన్నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్‌ను పాక్షికంగా తాకాయి. ప్రతి ఏడాది మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఈ సుందర దృశ్యం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచుతుంది. మంగళవారం నుంచి స్వామి వారిని కిరణాలు తాకడం ప్రారంభం కాగా రానున్న రెండు మూడు రోజుల్లో స్వామి వారిని పూర్తిగా అభిషేకించడాన్ని భక్తులు చూడవచ్చని ఆలయ అర్చకులు తెలిపారు.

యార్డుకు 1,10,256 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,10,256 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,07,643 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 78,674 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

9, 10 తేదీల్లో 'ఎకనామిక్స్' జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారతీయ ఆర్థిక వ్యవస్థ-ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అనే అంశంపై ఈ నెల 9, 10 తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశంలోని పలు యూనివర్సిటీలు, ఆర్థిక పరిశోధన కేంద్రాల నుంచి అధ్యాపకులు, ఆర్థికవేత్తలు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించనున్నారన్నారు.

దివ్యోత్సవం.. రథోత్సవం



మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

- పోటెత్తిన భక్తజనులు
- కిటకిటలాడిన మంగళగిరి వీధులు
- జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మార్మోగిన మంగళాద్రి
- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: నగరంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహస్వామి దివ్య రథోత్సవం మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. దివ్యమంగళ స్వరూపులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మంగళాద్రి భక్తులతో పోటెత్తింది. నగర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకున్న స్వామి వారు మంగళవారం ఉదయం బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధన అనంతరం 3 గంటలకు ఉభయదేవేరులతో స్వామి వారు దివ్యరథాన్ని అధిరోహించారు. అలంకరణ, పూజల అనంతరం 4 గంటలకు స్వామి దివ్య రథం భక్తుల గోవింద నామస్మరణ మధ్య బయలుదేరగా జైనారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళాద్రి భక్తిపారవశ్యంలో ఓలలాడింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. గాలిగోపురం వద్ద నుంచి బయల్దేరిన రథోత్సవం మెయిన్ బజార్‌లోని మిద్దె సెంటర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజల అనంతరం తిరిగి అదే మెయిన్ బజార్‌లో గాలిగోపురం వద్దకు చేరుకుంది. భక్తులు భారీగా తరలిరావడంతో పలురోడ్లు కిటకిటలాడాయి. ఉత్సవ కైంకర్యపరులుగా మాఢభూషి వేదాంతచార్యులు వ్యవహరించగా ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ చిరంజీవి



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి

అతివకు అండగా జగనన్న

మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతోంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. అన్ని అంశాల్లో స్వేచ్ఛ.. సమానత్వంతో నేటి మహిళ దూసుకెళుతూ సమాజంలో స్ఫూర్తివంతమైన పాత్ర పోషిస్తోంది. గతానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి మగువకు అన్ని అంశాల్లో అధిక ప్రాధాన్యతనిస్తోంది. సామాజికంగా.. ఆర్థికంగా.. రాజకీయంగా ప్రోత్సాహం అందిస్తోంది. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళామణుల అంతరంగాలు వారి మాటల్లోనే..

– సాక్షి, నరసరావుపేట

మహిళాభ్యుదయంలో దేశానికే ఆదర్శం జగనన్న



మహిళా సాధికారత విషయంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజా సంకల్ప యాత్రలో మహిళల కష్టాలు విన్న జగనన్న వారి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. – విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

జీవనోపాధుల కల్పనతో ఆర్థిక స్వేచ్ఛ



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే స్వేచ్ఛగా బతకడానికి వీలుకలుగుతుంది. అది గుర్తించిన ప్రభుత్వం మహిళలకు ప్రభుత్వం నుంచి నేరుగా సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం చేయడంతో పాటు జీవనోపాధులు కల్పిస్తోంది. దీంతో మగవారిపై ఆధారపడకుండా కుటుంబాన్ని స్వతహాగా పోషించుకొనే స్థాయికి వెళ్లారు. – డి.దుర్గాబాయి, ఈడీ, బీసీ కార్పొరేషన్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. పుట్టినప్పటి నుంచి వారికి మెరుగైన పౌష్టికాహారం, అవసరమైన టీకాలు వేసి నిండు ఆరోగ్యంతో ఉండేలా చూస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మెడికల్ సిబ్బంది పోస్టులు భర్తీ చేసి ఎంతో మంది మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించారు. – డాక్టర్ జి.శోభారాణి, డీఎంహెచ్ఓ

మహిళా ఉద్యోగులకు అండగా..



ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. డీఎంహెచ్ఓ, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ వంటి జిల్లా స్థాయి పోస్టుల్లో మహిళకు అవకాశం ఇవ్వడంతోనే అర్థం చేసుకోవచ్చు. ఇది మహిళా ఉద్యోగుల మేలు కోరే ప్రభుత్వం. మహిళలకు ఐదు అదనపు సెలవులు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. – డాక్టర్ పి.సునీల, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్, పల్నాడు జిల్లా

ఓ అన్నలా భరోసా



ప్రభుత్వం అతివలకు అండగా నిలుస్తోంది. దిశ వంటి చట్టాలను తీసుకువచ్చి మహిళలకు ఓ అన్నలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. గిరిజన మహిళలు గతంలో కన్నా మెరుగైన ఆరోగ్యం, ఆర్థిక స్థితిలో ఉన్నారు. – ఎల్.వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం



వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. అధిక పదవులు కేటాయించి మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. – ఏఎస్ దీప్తి, డీడీ, ఐ అండ్ పీఆర్

ఒకేసారి 17 వైద్య కళాశాలలు

- ఏప్రిల్ 1 నుంచి పీజీ వైద్య విద్యార్థులకు సీఎంఈ
- హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి
- ఘనంగా గుంటూరు వైద్య కళాశాల కాలేజీడే వేడుకలు



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతిని సన్మానిస్తున్న డాక్టర్ బాబ్జి తదితరులు

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 వైద్య కళాశాలలను తొలిసారిగా ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మంగళవారం రాత్రి వైద్య కళాశాల కాలేజ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు ప్రాంతీయ నిరంతర వైద్య విద్య కార్యక్రమాలను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. వైద్య విద్యను బలోపేతం చేసేందుకు వైద్య కళాశాలల్లో ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు వైద్య కళాశాల నుంచి ఎంతో మంది పేరుప్రఖ్యాతలు గడించిన వైద్యులు బయటకు వచ్చి ప్రపంచ వ్యాప్తంగా వైద్య సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. కళాశాలలో చదువుకున్న పలువురు పద్మశ్రీలు అందుకోవడంతో పాటు, రాజకీయవేత్తలుగా సేవలందిస్తున్నారని తెలిపారు. గుంటూరు జీజీహెచ్, వైద్య కళాశాల అభివృద్ధిలో తాను డీఎంఈగా ఉన్నప్పుడు చేసిన పనుల గురించి వివరించారు. వైద్యులు రోగుల సేవలకు ప్రాధాన్యత ఇచ్చి నిజాయితీతో వైద్య సేవలు అందించాలని సూచించారు.

మానవతా దృక్పథం అవసరం

సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నవారు మానవతా దృక్పథంతో పాటు పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదని, వారి త్యాగాల ఫలితంగా వైద్యులయ్యారనే విషయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకోవాలన్నారు. డబ్బు కోసం పాకులాడకుండా వైద్య సేవలు అందించాలని, ఉత్తమ వైద్యులుగా గుర్తింపు పొందితే డబ్బులు వాటంతట అవే వస్తాయన్నారు. రోగుల పట్ల సానుభూతి, జాలి, దయ కలిగిఉండాలని, వృత్తి పట్ల అంకితభావం ఉండాలని చెప్పారు. పలు హాస్యపు చలోక్తులతో వైద్య విద్యార్థులను ఆనందపు జల్లుల్లో ముంచెత్తారు.

వైద్య కళాశాల చరిత్రలో ఈ ఏడాది స్వర్ణయుగం..

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి మాట్లాడుతూ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసి పైలాన్ ఆవిష్కరించారని, వైద్య కళాశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధునీకీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైద్య కళాశాల చరిత్రలో ఈ ఏడాది స్వర్ణయుగమని అభివర్ణించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ మాతృసంస్థను మరువకుండా కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జింఖానా కో-ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు కళాశాల అభివృద్ధికి జింఖానా చేస్తున్న సేవలను వివరించారు. ఎంసీహెచ్ నిర్మాణానికి రూ.86 కోట్లు విరాళాలు సేకరిస్తున్నామని, పూర్వ విద్యార్థులంతా ముందుకు రావాలని కోరారు. వైద్య కళాశాల ఈ-సావనీర్‌ను డాక్టర్ బాబ్జి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ, పలువురు బోధనా సిబ్బంది, గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతి కార్యక్రమాలతో వైద్య విద్యార్థులు అలరించారు.

మహిళా సమగ్రాభివృద్ధే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- జెడ్పీలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి రత్నకుమార్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు బాల్య వివాహాల నిరోధంపై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. మహిళలకు భద్రత కల్పించి, దాడులను నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని చెప్పారు. ఆడపిల్లలకు ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తోందని చెప్పారు. బాల్య వివాహాలు సమాజానికి మాయని మచ్చలా మారాయన్నారు. వలంటీర్లు బాల్య వివాహాలు జరగకుండా పూర్తిగా నిరోధించాలని ఆదేశించారు.

బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు శిక్ష

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ మాట్లాడుతూ లింగ సమానత్వం మన రాష్ట్రంలోనే బాగుందని, మహిళలను ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందని చెప్పారు.

న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని, ఇటీవల జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా 14 మంది మహిళలు నియమితులు కావడం శుభపరిణామమని పేర్కొన్నారు. బాల్య వివాహం చేస్తే అందుకు బాధ్యులైన తల్లిదండ్రులతో పాటు సహకరించిన వారికి సైతం రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి గౌరవప్రదమైన స్థానంలో నిలిపారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు, డీఎంహెచ్‌వో శ్రావణ్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బి.మనోరంజని, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జి.ప్రమీల, స్టెప్ మేనేజర్ బి.రాధిక, ఫ్రాన్సిస్ కుమార్, స్టెప్ సీఈవో పల్లవి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా సాగర్‌మాత మహోత్సవం

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో మంగళవారం సాగర్‌మాత మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శాంతి, సమాధానం, ప్రేమ, కరుణను ప్రసాదించే సాగర్‌మాత భక్తుల పాలిట కల్పవల్లి అని గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సమష్టి దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించి జోసఫ్ ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన సాగర్‌మాత (మరియమ్మ)ను భక్తివిశ్వాసాలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని చెప్పారు. పరిపూర్ణ హృదయం, జ్ఞానం, వివేకంతో మన తండ్రి అయిన ఏసుక్రీస్తును ప్రార్థించాలని, నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలని కోరారు. అనంతరం సాగర్‌మాత మహోత్సవాల సందర్భంగా ఆలయాలు, జపమాల క్షేత్రాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం 5.30 గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌తో, 6.30 గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంతో దివ్యబలిపూజ, 10 గంటలకు గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్‌తో జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2 గంటలకు గురుశ్రీ గోపు జోసఫ్‌తో వాక్య పరిచర్య, స్వస్థత ప్రార్థనలు, సాయంత్రం 5.30 గంటలకు రెంటచింతల విచారణ గురువులు గురుశ్రీ ఏరువ లూర్దు మర్రెడ్డితో జపమాల, తేరుప్రదక్షిణ, దివ్యబలిపూజ, 7.30 గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ ఘనంగా జరిపారు. రాత్రి 8 గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందంతో సాగర్‌మాత-సహాయమాత బుర్రకథ, రాత్రి 9 గంటలకు ధనవంతుడు- బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

సాగర్‌మాత మహోత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో విజయపురిసౌత్ కళకళలాడింది. స్థానిక లాంచీస్టేషన్ సెంటర్ నుంచి సాగర్‌మాత దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపుల తినుబండారాల కేంద్రాలు, ఫ్యాన్సీ షాపులు, వివిధ రకాలైన ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. సాగర్‌మాత ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, రంగుల రాట్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాగర్‌మాత దేవాలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఉచిత వైద్య శిబిరాలు

సాగర్‌మాత దేవాలయానికి వచ్చే భక్తుల కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు కేపీ చారి, కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సమృద్ధి ఫౌండేషన్, స్థానిక కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.



దివ్యబలి పూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న గురుశ్రీ జోసఫ్



విద్యుద్దీపాలంకరణలో సాగర్‌మాత దేవాలయాలు

పల్నాడును తొలి ఐదు స్థానాల్లో నిలపాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: పల్నాడు జిల్లాను రాష్ట్రంలో తొలి ఐదు స్థానాల్లో నిలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రధానంగా జగనన్న భుహక్కు, భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. భూ హక్కుల స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్), భూ హక్కు పత్రాల పంపిణీ, సర్వే కొలతల దరఖాస్తుల పరిశీలన-పరిష్కారం, వ్యవసాయ భూముల పంపిణీ, ఎస్సీ, ఎస్టీల శ్మశానవాటిక కోసం భూమి గుర్తింపు, వన్ టైం కన్వర్షన్, రెవెన్యూ కార్యాలయాల్లో ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్, రిజిస్ట్రేషన్ పనులు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు కార్డుకు ఆధార్ వివరాలు అనుసంధానం, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు వంటి సమస్యల పరిష్కారం త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్నీ మండలాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు, భూ సర్వే, రికార్డుల పరిరక్షణ శాఖ ఏడీ నాగశేఖర్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీవోలు మర్రి శేషిరెడ్డి, రాజకుమారి, అద్దయ్య, మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ కార్యాలయ రెవెన్యూ శాఖ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

175 సీట్లు సాధ్యమే..

వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జోనల్ ఇన్‌చార్జి కన్నా



అచ్చంపేట: సీఎం జగన్‌మోహనరెడ్డి చెప్పినట్లు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో 175కి 175సీట్లు సాధ్యమేనని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన కన్నా హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, చిగురుపాడు ఆర్ అండ్ ఆర్ సెంటర్‌కు చెందిన తనను మూడు జిల్లాలకు ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మూడున్నరేళ్లుగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందచేస్తున్న సీఎం పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఇంటికి మేలు చేకూరిందన్నారు. మేలు చేసిన వారిని వదలి కీడు చేసేవారికి ప్రజలు ఎన్నడూ మద్దతు ఇవ్వరని చెప్పారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని ఎన్నో పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహనరెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని, తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానని కన్నా చెప్పారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన పార్టీ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

- ఎంపీ లావు, ఎమ్మెల్సీ జంగా, ఎమ్మెల్యే కాసు
- ఘనంగా నిదానంపాటి లక్ష్మీఅమ్మవారి తిరునాళ్లు



దేవాలయానికి విచ్చేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

పిడుగురాళ్లరూరల్: కుల, మతాలకతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలని, గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుల, మతాలు, పార్టీలకతీతంగా గ్రామస్తులంతా కలిసి అమ్మవారి తిరునాళ్ల జరుపుకోవటం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో పాడిపంటలు సుభిక్షంగా పండాలని, సిరిసంపదలతో తులతూగాలని అమ్మవారి ఆశీస్సులు కావాలని అన్నారు. అమ్మవారి అండదండలతో జానపాడు కల అయిన బ్రిడ్జిని తీసుకొని వచ్చామన్నారు. వచ్చే నెలలో బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తామని, సంవత్సర కాలంలో బ్రిడ్జిని ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రజాప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి ఉన్నం గ్రూప్స్ అధినేత ఉన్నం నరసింహారావు, గురజాల నియోజకవర్గ సీనియర్ నాయకులు ఉన్నం నాగమల్లికార్జునరావు, కూరపాటి కొండలు, సర్పంచ్ తాళ్లపోగు మర్యాదరావు, ఆలయ కమిటీ సభ్యులు కూరపాటి కొండలు, బండి కాశయ్య, మల్లెల లక్ష్మీనారాయణ, జడ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహ్మదీయ మసీద్‌ను ఎండీ ఉస్మాన్ మేస్త్రితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా మంగళవారం ప్రారంభించారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ జంగాను సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ముస్లిం, మైనార్టీలకు సమాన అవకాశాలు సీఎం జగన్ కల్పిస్తున్నారని, అన్ని విధాలుగా ముస్లిం, మైనార్టీలకు అండగా ఉన్నారన్నారు. గామాలపాడులో మసీద్‌ను నిర్మించటం సంతోషంగా ఉందని, ఖురాన్, బైబిల్, భగవద్గీత అందరూ సమానమేనని, అందరూ ఐక్యంగా ఉండాలని బోధిస్తున్నాయని చెప్పారు. సోదరభావంతో కలిసిమెలసి ఉండాలని, అల్లా చెప్పినట్లు ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలని అన్నారు. హైవే పక్కన నిర్మించిన ఈ మసీద్‌కు ఏపీ నుంచే కాకుండా పక్కనే ఉన్న తెలంగాణ నుంచి కూడా ముస్లింలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రపంచంలో శాంతి వర్ధిల్లేలా ప్రతి ఒక్కరూ అల్లాను ప్రార్థించాలని కోరారు. తమ సొంత నిధులతో పలుచోట్ల షాదీఖానాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఉస్మాన్ మేస్త్రి, జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, కౌన్సిలర్లు షేక్ షరీఫ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలనా ముస్తాఫా, ముఫ్తీ యూనిస్, మౌలనా ఫరూక్, ముఫ్తీ యూసుఫ్, ముఫ్తీ రఫీ, ఖాసుమల్లి, రసూల్, అబ్దుల్ అజీజ్, షమీన్, జిలానీ, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు వైద్య పరికరాల వితరణ



గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా కళాశాల 1985 బ్యాచ్‌కుచెందిన పలువురు పూర్వ వైద్య విద్యార్థులు రూ.5 లక్షలు ఖరీదు చేసే పలు వైద్య పరికరాలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవికి అందజేశారు. కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలను డాక్టర్ పద్మావతిదేవి కొనియాడారు. డాక్టర్‌లు వి.వి.రామ్‌కుమార్, గంగాధర్, నాగరాజు, శివరామకృష్ణ, శైలజ పాల్గొన్నారు.

యాజమాన్యం, కార్మికులు రెండు కళ్లు



పరాశక్తి కార్మికుడు శంకర్‌ను సన్మానిస్తున్న ఎం.వి.శివకుమార్‌రెడ్డి

సత్రశాల(రెంటచింతల): కార్మికుడు మానసిక ప్రశాంతతో విధులకు హాజరైనప్పుడు ఎలాంటి ప్రమాదాలు దరిచేరవని గుంటూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వి.శివకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరాశక్తి సిమెంట్ కర్మాగారంలో ఫ్యాక్టరీ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్(వర్క్స్) ఎంఎస్ఎన్ రాజు అధ్యక్షతన 52వ జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలకు యాజమాన్యం, కార్మికులు రెండు కళ్లులాంటివన్నారు. సమన్వయంతో వ్యవహరించినప్పుడే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మన మీద కుటుంబం ఆధారపడి ఉందనే విషయం కార్మికులు గుర్తించుకోవాలన్నారు. 2006లో ప్రారంభించిన పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో ఇప్పటి వరకు ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న యాజమాన్యాన్ని అభినందించారు. ముందుగా జాతీయ భద్రతా జెండాను ఆయన ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ భద్రతా కార్మిక విభాగంలో బహుమతిని పొందిన పరాశక్తి ఫ్యాక్టరీ కార్మికుడు రమావత్ శంకర్‌ను సన్మానించి, అభినందించారు. కార్మికులకు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో పాల్గొన్న విజేతలకు, ఫ్యాక్టరీ కార్మికులకు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

భద్రతతో కూడిన పని ముఖ్యం

దాచేపల్లి: భద్రతతో కూడిన పని పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ.శివకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమలో 52వ జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల భద్రతే లక్ష్యంగా యజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, భద్రత లేకుండా పనిచేయవద్దని చెప్పారు. భద్రతతో కూడిన పనిచేయటం వలన పరిశ్రమ అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని, కార్మికులు కూడా భద్రతతో పనిచేయాలన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలైన కార్మికులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జాయింట్ ప్రెసిడెంట్ సీహెచ్.సీతారామయ్య, సేఫ్టీ ఇన్‌చార్జి వెంకట్, సీఎస్‌వో మూర్తి, హెచ్‌ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు మొదటి ప్రాధాన్యత అభినందనీయం

మాచర్ల: పట్టణంలోని కేసీపీ సంస్థ నాణ్యతతోపాటు భద్రతకు మొదట ప్రాధాన్యతనివ్వటం అభినందనీయమని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి అన్నారు. కేసీపీలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ఘనంగా జరిపారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేసీపీ సంస్థను ఉద్యోగులు, కాంట్రాక్టర్లు సమష్టిగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. జిల్లాలో ప్రమాద రహిత కార్మికులను ప్రత్యేకంగా అభినందించి ఉత్తమ కార్మికులతోపాటు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కేసీపీ జనరల్ మేనేజర్ బీవీపీఎస్ చౌదరి, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, మైన్స్ మేనేజర్ రమణ, వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు నారాయణ, ఓర్సు శివయ్య, బి వెంకటేశ్వర్లు, కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ముడుపులు తీసుకొని పర్మిషన్లు ఇచ్చారు

- అక్రమ మైనింగ్‌పై చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మాచవరం మండలం రేగులగడ్డ క్వారీకి రూ.70 లక్షలు ముడుపులు తీసుకొని పర్మిషన్ ఇప్పించింది యరపతినేని శ్రీనివాసరావేనని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ యరపతినేని ఎల్లో మీడియాను వెంట పెట్టుకుని రేగులగడ్డ వెళ్లి హల్‌చల్ చేయటం దొంగే దొంగ దొంగ అని అరచినట్లు ఉందని అన్నారు. రాజకీయాలు చేసేందుకు, విమర్శించేందుకు ఏమీ లేకపోవటంతో తాను అనుమతులు ఇప్పించిన క్వారీనే ఇప్పుడు అనుమతులు లేకుండా క్వారీ నిర్వహిస్తున్నారని ఆరోపించడం ఆయన నీచరాజకీయానికి అద్దం పట్టిందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరినా, చర్చకు రాకుండా అక్రమ మైనింగ్ గురించి మాట్లాడడం సరికాదని అన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అక్రమ మైనింగ్, అక్రమాలను తమ పార్టీకి పూయాలని చూస్తే నియోజకవర్గ ప్రజలు చూస్తూ ఊరుకోరని, ఖచ్చితంగా యరపతినేనికి మరోసారి బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చొబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనుమతులు పొంది, రాయల్టీ చెల్లిస్తున్న వారే క్వారీ నిర్వహిస్తున్నారని అన్నారు. అక్రమ మైనింగ్‌పై బహిరంగ చర్చకు తాను సిద్ధమని కాసు మహేష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎక్కడైనా వస్తానని, లెక్కలతో వస్తానని అన్నారు. యరపతినేని అందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- జిల్లా మహిళా ప్రభుత్వ అధికారులకు సన్మానం



డీఎంహెచ్‌వో శోభారాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: మహిళలకు అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల సంఘం, జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పురోగతి సాధించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నామినేటెడ్ పదవుల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి, జీఎస్‌డబ్ల్యూ స్పెషల్ ఆఫీసర్ మహాలక్ష్మి, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఆఫీసర్ వనజా తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో కర్ణాటక పోలీసుల దాడి



నిందితులను తీసుకు వెళుతున్న పోలీసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కర్ణాటక(బెంగళూరు) పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వ హించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గోగులపాడు గ్రామానికి చెందిన గోపసాని ఏడుకొండలు కొంత కాలంగా సత్తెనపల్లిలో నివాసం ఉంటున్నాడు. గత నెల 21న బెంగళూరులో ఇత్తడి చూపి బంగారంగా నమ్మించి రూ.13 లక్షలు చీటింగ్ చేసి పరారయ్యాడు. దీనిపై ఫిర్యాదు రావడంతో బెంగళూరు పోలీసులు విచారణ చేపట్టారు. ఆయన భార్య, ఒక కుమార్తె, అల్లుడు శివను పోలీసులు బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. మరో కుమార్తె అద్దంకిలో ఉండటంతో ఆమెను అదుపులోకి తీసుకోవడంతో నగదు సత్తెనపల్లిలో ఉంచినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు సోమవారం రాత్రి ఏడుకొండలు కుటుంబసభ్యులను వెంటపెట్టుకొని గోగులపాడు వచ్చారు. అక్కడ నగదు లేకపోవడంతో సత్తెనపల్లి వచ్చారు. మధ్యవర్తిగా వ్యవహరించిన దుర్గారావు బెంగళూరు పోలీసులతో మాట్లాడాడు. ఏడుకొండలు ఆచూకీ దొరకగానే చెబుతామని, రూ.8 లక్షలు నగదు ఉన్నాయని, వాటిని తీసుకొని మహిళలను వదిలి పెట్టమని కోరాడు. దీనికి పోలీసులు అంగీకరించారు. దుర్గారావు రూ.8 లక్షలు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాడు. అనంతరం నిందితులను వదిలేది లేదని పోలీసులు అడ్డం తిరిగారు. స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు రంగప్రవేశం చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బెంగళూరు పోలీసులకు రూ.8 లక్షలు అందించగా వారు నగదుతోపాటు ఏడుకొండలు కుటుంబసభ్యులను కూడా తీసుకొని వెళ్లారు. ఈ వ్యవహారం కలకలం రేపింది.

అటవీ ప్రాంతంలో అక్రమ మైనింగ్ అవాస్తవం

అటవీశాఖ రేంజ్ అధికారి శేఖర్

మాచవరం: మండలంలోని రేగులగడ్డ ప్రాంతంలో అటవీ భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు ప్రచురితమవుతున్న వార్తల్లో వాస్తవం లేదని అటవీశాఖ పిడుగురాళ్ల రేంజ్ అధికారి ఆర్.శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓ దినపత్రికలో ప్రచురితమైన వార్తను ఆయన ఖండించారు. దాచేపల్లి సెక్షన్ వేమవరం బీటు పరిధిలోని రేగులగడ్డ అటవీప్రాంత పరిసరాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. 2019లో శ్రీలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ సంస్థకు వేమవరం గ్రామ శివారు సర్వే నెం.481 బి1 లో 3.150 హెక్టార్ల రెవెన్యూ భూమిలో మైనింగ్ నిర్వహణకు అనుమతులు ఉన్నాయన్నారు. మైనింగ్ జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న లీజు ప్రాంతం రిజర్వు ఫారెస్టుకు 42.60 మీటర్ల దూరంలో ఉన్నదని తెలియజేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా వార్తను ప్రచురించడం సరికాదన్నారు. ఏదైనా ఉంటే అధికారులను సంప్రదించి వివరణ తీసుకోవాలని సూచించారు.

సీఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రాభివృద్ధి

మూడు జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న పీవీఆర్

మాచర్ల: భారతదేశంలో బడా పారిశ్రామికవేత్తలను ఆకర్షించి ఒప్పించి రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు చేసుకొని ఆరు లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని మూడు జిల్లాల యూత్ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ విజయవంతం సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టపాసులు కాల్చారు. అనంతరం పీవీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు విమర్శించటం అలవాటుగా మారిందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధిని సైతం చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. దీనిని గమనించకుండా ప్రతిపక్షాలు విమర్శలు చేయటం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, మాచర్ల, ఎంపీపీలు బూడిద శ్రీను, యేమూరి సునీత సాయిశంకర్, మేకల శారద, దాసరి చౌడేశ్వరి నరసింహారావు, చింతా శివరామయ్యలు, జెడ్పీటీసీ సభ్యులు పెదమల్లుస్వామి, రూప్లీ బాలునాయక్, శెట్టిపల్లి యలమంద, జిల్లా వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఈనెల 13 నుంచి పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం మైదానంలో పర్యటించారు. పరుగు పందెం పోటీలు నిర్వహించేందుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. ఇతర పోటీల నిర్వహణపై పోలీస్ అధికారులతో చర్చించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురుష/మహిళా అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలపై చర్చించారు. మైదానంలో అక్కడక్కడ ఏపుగా పెరిగిన గడ్డిని తొలగించారు. ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రమేష్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

